స్కెచ్

# తప్పెవరిది?

విశ్వమిత్ర

నీళ్లనిండిన కళ్లతో జగన్నాథం, తన ముందున్న నిప్పుల కుండలోకి అదోరకంగా చూశాడు. నిప్పు రాజుకొంటోంది. అప్రయత్నంగా జగన్నాథం కళ్ళనుండి రెండు నీటిచుక్కలు ఆ కుండలో పడ్డయ్. జగన్నాథానికి చిన్న నవ్వొచ్చింది. తన మనసులోని మనసులో ఎక్కడో, తన 'రాజమ్మని'...అప్పటికే బాగా రాజుకున్న నిప్పు ఆ కన్నీటికి ఆరలేదు. అందుకే జగన్నాథానికి చిన్న నవ్వొచ్చింది. "నేనేం తప్పుచేశానండీ!" అంటూ అమాయకంగా అడిగే రాజమ్మ ముఖం ఆ కుండలోకెలా వొచ్చింది? "లేదు-రాజూ-లేదు. నువ్వేంతప్పుచెయ్యలేదు-!" అందామనుకొన్నాడు. గాని నోరు పెగల్లేదు. తన రాజమ్మ ఇంకో పావుగంట బతికుంటే జగన్నాథం ఆమెకేవేవో చెప్పేవాడు.

జగన్నాథం రాజమ్మని ప్రేమించాడో లేదో అతనికే తెలియదు. రాజమ్మ జగన్నాథం భార్య. అందుకని విధిగా అతన్ని ప్రేమించాలి.

జగన్నాథానికి కష్టాలు కొత్తవికావు. కాని రాజమ్మలాటివాళ్లు చచ్చిపోటంలాంటి కష్టాలు జగన్నాథం ఎప్పుడూ చూళ్ళేదు. ఎన్నెన్నో బరువులు మోసిన తన చెయ్యి, ఆరోజు ఆ చిన్న కుండే మొయ్యలేకపోయిందేం?— రాజమ్మని మంటలు కావులించుకొంటున్నాయ్, అయినా రాజమ్మ తొణకదేం? కష్టాలకి అలవాటుపడ్డ రాజమ్మకి అదేమంత బాధ అనిపించటం లేదేమో—!

"అదేమిటోయ్- జగన్నాథం, నీ భార్య అలా మంటల్లోవుంటే అలా చూస్తూ వూరుకొంటావేం?" ఎవరో తనని ఎక్కిరిస్తున్నట్టుగా అనిపించింది. కాని తను రాజమ్మని కష్టాల్నుంచి ఏరోజు తప్పించాడు కనక!- ఇవ్వాళ మంటల్లో ఉంటే ఇవతలకి లాగటానికి ప్రయత్నించకపోవటానికి? రాజమ్మ జీవితం రోజూ అలా కష్టాల్లో తగలడుతూనే వుంది. ఇవాళ కొత్తేమిటి? జగన్నాథాన్ని ఆలోచనలు పీక్కుతింటున్నయ్. రాజమ్మని పెళ్ళిచేసుకునేదాకా తనని చంపేసిన పెద్దమనుషులందరూ ఏమైనారో ఒక్కరూ కనపడరేం?

తర్వాత మూడురోజులవరకూ అన్నం సహించనేలేదు జగన్నాథానికి. రాజమ్మమీద వున్న ప్రేమచేత కాదు, రాజమ్మ చచ్చిపోటానికి తను కారణమైనందుకు. అంతమాత్రంచేత జగన్నాథానికి తనమీద తనకేమీ అసహ్యం వెయ్యలేదు! తనెందుకు అలా తయారయ్యాడు, పుట్టుకతో తను అలాంటివాడు కాదే.

కాళ్ళు చాపి పడక్కుర్చీలో పడుకుని సిగరెట్ కాలుస్తున్న జగన్నాథానికి పాత స్మృతులు జ్ఞాపకానికొచ్చినయ్.

మొట్టమొదట సీత కనపడింది. తన ప్రేమకి తల్లివేరు సీత. సీత నల్లగా మసిబొగ్గులావుంటుంది. ఐతే ఏం-ఎప్పుడూ చిరునవ్వునవ్వే ముఖం. తన దగ్గిర ఏ రహస్యం దాచుకోలేని సీత కళ్ళు జ్ఞాపకానికొచ్చి జగన్నాథం మనసులో కలుక్కుమంది-సీతా-మన కథ ఓసారి జ్ఞాపకంచెయ్యవూ? దీనంగా అడిగాడు జగన్నాథం.

కష్టాల్లో అందరూ దేవుణ్ణి తలుచుకున్నట్టు, జగన్నాథం సీతను తలుచుకొంటాడు. సీత అతని కష్టాల్ని మరిపించి, జోకొట్టి నిద్రపుచ్చుతుంది.

"ఏది చెప్పను? కళ్యాల్లో, కుప్పకి కాపలా పడుకున్నప్పుడు అర్థరాత్రి ఎవ్వరికీ తెలీకుండా నేను నీదగ్గిరికి వొచ్చింది చెప్పనా? లేకపోతే నాకు జబ్బుచేసినప్పుడు ఎవరూ లేకుండా వున్నప్పుడు నువ్వొచ్చి నన్ను ముద్దుపెట్టుకుని నాకు చెప్పిన కులాసా కబుర్లు చెప్పనా?" అందిసీత.

"ఏదో ఒకటి చెప్పు" అన్నాడుగాని మొదట, తర్వాత మళ్ళీ ఏమనుకొన్నాడో ఏమోగాని

"నేను అప్పుడు చెప్పిన కులాసా కబుర్లే చెప్పు" అన్నాడు.

ఇంతలో చిన్న గాలి కొట్టింది. ఆలోచనల ధోరణిలో పీల్చడం మానేసిన సిగరెట్ ఆరి పోయింది. మళ్ళీ వెలిగించి తలపైకెత్తాడు.

సీత తనవొంక కోపంగా చూస్తోంది. నల్ల మొహం ఎర్రరంగు కలిసి అదోరకంగా వుంది. తలొంచుకొని, కళ్ళు సగం తెరిచి తనవొంక చూస్తోంది.

"ఏం-సీతా? ఏమిటీ?" అన్నాడు.

"నీకు విశ్వాసం లేదు - నీలో ప్రేమ అనేది నిలువునా చీల్చినా కనపడదు. నాకు తెలుసు. నువ్వు వొట్టి ముండల మురాకోరువి!" సీతకి కోపం వొచ్చింది.

ఆ మాటలు విన్న జగన్నాధానికి కోపం రాలేదు. విచారంతో నుదురు ముడతలు పడింది.

"నిజమే సీతా! నువ్వన్నవన్నీ నిజమే! కానీ వాటన్నిటికీ కారణం నేనేనంటావా?"

ఈ గొడవలన్నీ లేకుండా తను సీతను పెళ్ళి చేసుకోగలిగితే తన జీవితం ఎలా వుండేదో వూహించుకోటానికి ప్రయత్నిస్తున్నాడు జగన్నాధం.

"ఏమిటీ-! ఆ నల్లటి కొరివిదయ్యాన్ని పెళ్ళి చేసుకొంటావా? మన కులమూ కాదు పాడూ కాదూ-" అమ్మ జ్ఞాపకానికొచ్చింది జగన్నాధానికి.

"సీతని" చేసుకొంటే బావిలో దూకుతానని బెదిరించిన అమ్మ, తను సరోజిన్ని పెళ్ళిచేసుకొనేదాకా దుంపతెచి, తీరా పెళ్ళి ఐపోగానే తనుపోయింది. కాని అప్పటికి తనకిపట్టిన మనో వ్యాధి పట్టకుండావున్నా వ్యవహారం ఇంతవరకూ వొచ్చేదికాదు. సరోజినితో తనకి కలిగిన మొదటి పరిచయంలోనే సరోజిని తన దృష్టికి ఒకభోగ వస్తువుగా కనిపించింది. అందుకనే ఆ సంసారం అలా నడిచింది. జగన్నాధం సరోజినితో మనసిచ్చి మాట్లాళ్ళేక పోయేవాడు. ఏదో కన పడని పవిత్రతని అతను కోల్పోయినట్టు భావించే వాడు. తన 'పవిత్రత'ని దొంగిలించిందనే సరోజినిమీద కసి! అటువంటి జీవితాన్ని ఎంతోకాలం గడపలేక లేచిపోయింది సరోజిని కొంతకాలానికి. ఎక్కడికెళ్ళిందో, ఎవరితో వెళ్ళిందో జగన్నాధానికి తెలీలేదు. కొంతకాలం అలాగే గడిచి పోయింది.

తన పవిత్రతని ఒకసారి పోగొట్టుకొన్న జగన్నాధం, ఇహ దానిసంగతి మరిచిపోయాడు. సరోజిని వెళ్ళిపోవటం జగన్నాధాని కేమంత ప్రమాదం లేకపోయిందిగానీ, అతని బంధువర్గానికి మాత్రం తలలెత్తుకోవటానికి బాధగా వుండి ఎలాగయినా జగన్నాధానికి మరో పెళ్ళి చేయాలను కొన్నారు.

'రాజమ్మ'ని తీసుకొచ్చారు. జగన్నాధం నా కొద్దన్నాడు. గాని బంధువర్గంలోని పెద్దలంతా చేరి, కట్టకట్టుకొని తామంతా చచ్చిపోతామని భయపెట్టి, "నువ్వేమైనాఏడు-దీన్ని మాత్రం పెళ్ళిచేసుకో" అన్నారు.

జగన్నాధానికి "రాజమ్మ" మొదటిరోజులు జ్ఞాపకాని కొచ్చినయ్.

జగన్నాధం ఆమెతో "రాజూ—ముప్పయ్యేళ్లు రాకండానే నేను ముసిలివాణ్ణయిపోయాను—" అన్నాడు. అప్పటికే తను గడిపిన జల్సాజీవితం కళ్ళముందు గిర్రున తిరిగింది జగన్నాధానికి.

అమాయికంగా "రాజమ్మ"తనవొంక చూసేది. రాజమ్మ పతివ్రత అయితే మటుకేం, తన పాపం పంచుకొని పాపాత్మురాలయింది. ఆ విషయం తలుచుకొన్న కొద్దీ ఏడుపొస్తోంది జగన్నాధానికి. కనీసం ఈ సంగతంతా నిన్న ఆమెతో చెప్పలేకపోయానే అని విచారించాడు.

నీళ్ళునిండిన కళ్ళతో తలెత్తేటప్పటికీ మసక, మసగ్గా కనిపించింది సీత ముఖం.

"ఏం సీతా! తప్పెవరిది?" గొంతు పెగుల్చుకొని అడిగాడు జగన్నాధం.

తలొంచుకొని కన్నీళ్లు కారుస్తూ సీత అంది—

"జగన్నాధం—తప్పంతా నాదే, నిన్ను ప్రేమించడం, ప్రేమించనివ్వటం నాదే పొరపాటు—"

జగన్నాధం ఆశ్చర్యపడి, నోరు తెరుచుకొని అలానే వుండిపోయాడు.